

బిసిల ఆత్మగౌరవ సభ వాయిదా

ప్రజాశక్తి-కాకినాడ

ఆదివారం కాకినాడలో నిర్వహించాల్సిన బిసిల ఆత్మగౌరవ సభను జూలై 16వ తేదీకి వాయిదా వేసినట్లు ఎపి బిసి ఫెడరేషన్ నాయకులు తెలిపారు. అదే రోజున కాకినాడలో ఎంఎల్ఎకు మద్దతుగా 50 వేల మందితో బిసిలు ర్యాలీలు నిర్వహిస్తున్నారని అందువల్లే తాము వారి మనో భావాలను గౌరవిస్తూ తమ సభ వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. మల్లాడి కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ బిసి కులగణన, రిజర్వేషన్లు, పదోన్నతులు, హక్కులు వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపేందుకు నివేదిక తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, మల్లాడి రాజేంద్రప్రసాద్, చొల్లంగి వేణుగోపాల్, మాకిరెడ్డి భాస్కర్ గణేష్, సుందరపల్లి గోపాలకష్ణ, కొక్కిలిగడ్డ గంగరాజు, ప్రసన్నకుమార్, తాతారావు, రాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు పెట్టుబడి కష్టాలు

- పెండింగ్‌లో ధాన్యం బకాయిలు
- అందని రూ.15.47 కోట్ల సొమ్ము

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అప్పులు చేసి ఆరుగాలం కష్టించి పని చేస్తున్న అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ తీరుతో అన్ని రకాల సీజన్లలో అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఖరీఫ్‌లో ఇప్పుడు పెట్టుబడులు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. బ్యాంకులు సక్రమంగా రుణాలు ఇవ్వకపోవడం, ప్రధానంగా ధాన్యం బకాయిలు భారీగా పేరుకుపోవడంతో పెట్టుబడి కష్టాలు మరింత పెరిగాయి. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. మొత్తంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఏప్రిల్ 11వరకూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించలేదు. ప్రారంభించినా ఆదు నుంచి ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను నత్తనడకనే సాగించింది. దీంతో పలువురు దళారులకు అమ్ముకోవడం మొదలు పెట్టారు. సిబ్బందిని పూర్తిస్థాయిలో సన్నద్ధత చేయలేకపోయింది. గోనె సంచలు కొరత, ఇతర సమస్యలతో కొనుగోళ్లు మందుకొడిగా సాగాయి. తేమ శాతం నిబంధనలతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. మధ్యలో వరదలు వెంటాడాయి. దీంతో వందలాది మంది రైతుల పంట కొనుగోలు చేయకుండానే నీటిలో నానిపోయి కుళ్లి నష్టపోవాల్సి వచ్చింది. దీంతో కొద్దిరోజులు కొనుగోలు మరింత ఆలస్యం అయింది. ఈ నేపథ్యంలోనే అనేక మంది రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



రూ.15.47 కోట్లు బకాయిలు

జిల్లాలో 11,511 మంది రైతుల నుంచి రూ.173.35 కోట్లు విలువ గల 84,976 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయగలిగింది. ఇప్పటి వరకు రూ.157.88 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ.15.47 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 21 రోజుల లోపు ధాన్యం డబ్బులు రైతులకు అందాలి. కానీ నెల రోజులు పైనే గడుస్తున్న పలువురు రైతులకు నేటికీ ఈ ధాన్యం సొమ్ములు జమ కాలేదు. రూ.12.15 కోట్లు పేమెంట్ చేయడానికి బ్యాంకులకు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.3.32 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉందని తెలిపారు.

లక్ష్యానికి దూరం

సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా ప్రభుత్వ మాత్రం కేవలం 2.60 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని లక్ష్యంగా తీసుకుంది. కేవలం 84 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నడపలేకపోవడమే ఇందుకు కారణం. యంత్రాంగాన్ని సన్నద్ధత చేయడంలో విఫలం అవ్వడం మరో కారణం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు అడ్డు తగలడంతో అనేక మంది రైతులు కొనుగోలులో తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. బస్తా వద్ద రూ.150 నుంచి రూ.200 వరకు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో అమ్ముకున్నారు.

పెట్టుబడుల కోసం ఎదురుచూపులు

ఎన్ని కష్టాలు ఎదురైనా రైతులు మళ్లీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తొలకరి పలకరించింది. రైతులు నారుమడులను కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నారు. అప్పుల కోసం తిరుగుతున్నారు. ప్రభుత్వం మాత్రం గత రబీ డబ్బులు ఇంకా జమ చేయలేదు. వెంటనే పాలకులు స్పందించి బకాయి ఉన్న సొమ్ములను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ భారాలు రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రజలపై వివిధ రూపాల్లో వేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాలు రద్దు చేయాలని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. శనివారం సుందరయ్య భవన్‌లో కె.సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్‌పిఐ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి బాలాజీ, టిడిపి నాయకులు తుమ్మల రమేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు టి.రాజా తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీలు, ఇడి ఛార్జీలు, సర్ ఛార్జీల రూపంలో అనేక విధాలుగా ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకుని భారాలు వేయడం సమంజసంగా లేదన్నారు. మరోపక్క కేంద్ర బిజెపి పాలకులు తీసుకొచ్చిన కేంద్ర విద్యుత్ సవరణ చట్టాన్ని కూడా బిజెపి పాలిత రాష్ట్రాల కంటే ముందుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లకయ్యే రూ.వేల ఖర్చు వినియోగదారులపై వాయిదాల పద్ధతిలో విద్యుత్ బిల్లుల్లో వేయబోతున్నారని పేర్కొన్నారు. ఒక పక్క సంక్షేమ ప్రభుత్వం అని ప్రగల్భాలు పలుకుతూ మరోప్రక్క భారాలు వేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. జూన్ 30న విద్యుత్ కార్యాలయాల వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని సిపిఎం నాయకులు పలివెల వీరబాబు కోరారు. ఈ సమావేశంలో మలక వెంకట రమణ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకట రమణ, శివ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద అందిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికర పరిష్కారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతిని ఈ సందర్భంగా సిఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, వివిధ జిల్లా స్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం కింద వచ్చిన వినతులకు అత్యంత నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టరు తెలిపారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలలో జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పనులలో పురోగతి సాధించాలన్నారు. రెండో దశలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపట్టిన రీ సర్వే పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కషి చేయాలని కలెక్టరు కతికా శుక్లా తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఎ.రమణా రెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాసు, సర్వే ఎడి బి.లక్ష్మీనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రసాద్, డ్వామా పీడీ ఎ.వెంకట లక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎం.శ్రీనివాసు కాకినాడ, పెద్దాపురం డిఎల్‌డిఒ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



పరామర్శిస్తున్న ఎంఎల్ఎ దొరబాబు

సుబ్బిరెడ్డి కుటుంబానికి ఎంఎల్ఎ దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పెనుమల్లు సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు శనివారం పరామర్శించారు. సుబ్బిరెడ్డి అకాల మరణం బాధిత రైతులకు తీరని లోటని ఆయన అన్నారు. సెజ్ భూముల కోసం సుబ్బిరెడ్డి అలుపెరగని పోరాటం చేశారనిగుర్తు చేశారు. సుబ్బారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన కుమారుడు సత్యానంద రెడ్డికి ఎంఎల్ఎ భరోసా ఇచ్చారు. ఆయన వెంట దావీదు, వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడల్లో ప్రావీణ్యతను పెంచుకుని ఒలింపిక్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలని ప్రముఖ షటిల్ క్రీడాకారుడు, దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం సాధించిన డి.వర్షిణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ యువతలో క్రీడల ఆలోచనను ప్రోత్సహించడం ఒలింపిక్ దినోత్సవ ఉద్దేశం అన్నారు. వర్షిణి మాట్లాడుతూ థాయిలాండ్‌లో రైఫిల్ షూటింగ్ పోటీల్లో తనకు రజత పతకం లభించిందని అన్నారు. ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించడం తన లక్ష్యమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ రమణయ్యపేట గ్రామానికి చెందిన వర్షిణి జాతీయస్థాయి రజత పతకాన్ని పొందడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, కె.దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

'నా కాకినాడ - మన కాకినాడ'పై ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ

రాజకీయ దుష్టశక్తుల నుంచి కాకినాడ నగర ప్రతిష్టను కాపాడుకునేందుకు నా కాకినాడ-మన కాకినాడ పేరుతో ప్రచార ఉద్యమం చేపట్టాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతతకు మారు పేరుగా, పెన్షనర్స్ పేరడైజ్, రెండవ మద్రాస్‌గా దేశంలోనే నాలుగో బెస్ట్ లివింగ్ సిటీగా పేరుగాంచిన కాకినాడ నగరానికి చెడ్డ పేరు తెచ్చేలా టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మాజీ ఎంఎల్ఎ కొండబాబు వంటి దుష్టశక్తుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. గంజాయి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు కేంద్రంగా, బియ్యం అక్రమ ఎగుమతులకు నిలయంగా, నేరస్తులు, దోపిడిదారులకు అడ్డాగా, ఫ్యాక్షన్ ప్రాంతంగా కాకినాడ నగరాన్ని చిత్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నంపై ప్రతి పౌరుడినీ చైతన్యవంతం చేయాలనే లక్ష్యంగా ఉద్యమానికి సమాయత్తం చేస్తున్నారు. మన ఊరిని, మన ప్రాంతాన్ని, మన ప్రాంత ప్రతిష్టను కాపాడుకునేందుకు ఇక్కడ నివసించే ప్రతీ ఒక్కరి బాధ్యతగా తెలియజేస్తూ ప్రజలను మేల్కొల్పడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. శాంతియుతంగా ఉండే కాకినాడలో అలజడి రేగేలా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల యువతను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారన్నారు. ఇటువంటి ధోరణి వల్ల సుదీర్ఘ చరిత్ర కలిగి, దేశ, విదేశాల్లో మంచి పేరుప్రతిష్ట కలిగిన కాకినాడ నగరం అపఖ్యాతి పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతతంగా సామాజిక సహకలిగిన ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బిజెపి పాలనలో ఆర్థిక అంతరాల పెంపు

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్రంలో బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరగడమే కాకుండా ఆకలి, నిరుద్యోగం కూడా విపరీతంగా పెరుగుతున్నాయని ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వేంకటరత్నం నాయుడు (ఆర్‌విఎన్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జి.ప్రభాకర వర్మ అధ్యక్షతన 9 ఏళ్ల బిజెపి పాలన-తీరుతెన్నులు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో అజ శర్మ ప్రసంగించారు. మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో కార్పొరేట్‌లకు మంచి రోజులు, సామాన్యులకు గడ్డు రోజులు వచ్చాయన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోయిందిన్నారు. 127 దేశాల ఆకలి సూచికలో మన దేశం 107వ స్థానంలో ఉందంటే దేశంలో ఆకలి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. సదస్సుకు ముందుగా మాక్సీం గోర్కీ రచించిన అమ్మ నవలను సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు పరిచయం చేసారు. ఈ సదస్సులో వివి రమణ, టి.రాజా స్టడీ సర్కిల్ కన్వీనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజ శర్మ

కార్టూ'నిజం'



ఏమిటో.. ఈ వింతలు.. బటన్ నొక్కినా డబ్బులు పడ్డం లేదు.. స్విచ్ వేయకుండానే షాక్‌లు..!!



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అధికారులు బూత్ స్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించడానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రెండు లక్షల 55 వేల 38 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాలను బూత్ అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ మురార్జీ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాస్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం చేయాలని యోగా గురువు త్రినాథ్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఇందుకు జొన్న, రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాలను తీసుకోవాలని అన్నారు. శారీరక వ్యాయామం కోసం ప్రతి రోజు యోగాసనాలు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్.శ్రీ నగేష్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో మాల మహానాడు ఉపాధ్యక్షుడు దారా నూకరాజు ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ బిసి నేత గింజాల శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో మహిళలకు చీరలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర అనూష యాదవ్, బిసి సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, నేమాల శ్రీను, నైదాన రఘు, వమ్మి గంగరాజు, చేనిబోయిన బుజ్జి, షేక్ సుభాని పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ బుక్కా సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా శనివారం గరగల నత్యాలు, డప్పుల దరువుల మధ్య బుక్కా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఆలయం ఎదురుగా గరగల నత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని యాత్రికులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆశాదులు, వేద పండితులు పాల్గొన్నారు.

సక్రమంగా జగనన్న సురక్ష సర్వే

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని సామర్లకోట ఎంపిడిఒ శ్రీలలిత సూచించారు. ఉండూరు 01 సచివాలయంలో గ్రామ వాలంటీర్లు శనివారం ప్రారంభించిన సర్వేను ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఎలా నిర్వహించాలనే అంశాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.హరికష్ణ సత్య రెడ్డి, గ్రామ కార్యదర్శి కుమార్ రాజా, వాలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సత్యప్రభ పర్యటన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

టిడిపి ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ మండలంలోని మర్రివీడు, కంబాలపాలెం, పరిమితడక గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరుపుల రాజా ఆశయ సాధనకు వారిదిగా పని చేస్తానన్నారు. టిడిపి కార్యకర్తలంతా తారతమ్యాలు లేకుండా ఏకతాటిపై నిలిచి పార్టీ గెలుపునుకు కృషి చేయాలని కోరారు. జోరు వానను సైతం లెక్కచేయక సత్య ప్రభ పర్యటించారు. ఆమెకు గ్రామాల్లో మహిళల నుండి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వరుపుల రామకృష్ణ, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎంఎల్ఎ ద్వారంపూడి భూ దోపిడీ'

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ప్రభుత్వ భూమిపై టిడిఆర్ బాండ్లు మంజూరు చేయించి ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రూ.129 కోట్ల భారీ భూ దోపిడీకి పాల్పడ్డాడని టిడిపి నాయకులు ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు మాట్లాడుతూ సురేష్ నగర్ మున్సిపల్ పార్క్ భూ కుంభకోణంపై తాము పూర్తి ఆధారాలతో బయటపెట్టామన్నారు. కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి భూ కుంభకోణానికి సహాయ సహకారాలు అందించిన మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సురేష్ నగర్ పార్కుకు చెందిన ప్రభుత్వ భూమిపై దొంగ డాక్యుమెంట్ సష్టించి వాటిపై టిడిఆర్ బాండ్ల రూపంలో రూ.129 కోట్ల ప్రజాధనాన్ని ఎంఎల్ఎ ద్వారంపూడి దోచుకున్నారన్నారు. పూర్తి ఆధారాలతో కుంభకోణం బయటపడడం మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న అవగాహన లేని విమర్శలు చేస్తున్నారున్నారు. ద్వారంపూడి అవినీతి అక్రమాలకు మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. కార్పొరేషన్‌కు చెందిన పార్కు స్థలం తమదని పలువురు కోర్టుని ఆశ్రయించగా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఆగమేగాలపై కౌన్సిల్లో టిడిఆర్ బాండ్లు మంజూరు చేశారన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి బాలాజీ, పలివెల రవి, నాయకుడు తుమ్మల రమేష్, తెలుగు మహిళలు చిక్కాల సత్యవతి, మీసాల సునీత, గదుల సాయిబాబా, బంగారు సత్యనారాయణ, కొల్లు కుమారి, రిక్కా లక్ష్మి, కొపనాతి నాగ కుమారి, పిర్ల లక్ష్మి ప్రసన్న, అంబటి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి బీమా అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల మతి చెందిన గౌరీ కోనేరు కాలనీకి చెందిన కార్మికుడు గోరు వెంకటేశ్వరరావుకు సంబంధించి మంజూరైన వైయస్సార్ బీమా రూ.లక్ష చెక్కును శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ బాలాజీ, సంక్షేమ సెక్రటరీ వీరబాబు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న సాయిప్రసాద్

వల్లభ స్వామికి రూ.2.43 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వనభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ 1,78,140, అన్నదాన విరాళాల ద్వారా రూ 55,119,కేశఖండన ద్వారా రూ 9,900 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కృష్ణ, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలందించారన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-జగ్గంపేట

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు విద్యార్థులకు సూచించారు. స్థానిక అక్షర డిగ్రీ కళాశాలలో శనివారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, సిగరెట్లు వంటి మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి అ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ వ్యసనాల వల్ల యువత విద్యార్థి దశలో ఉరకలెత్తాల్సిన వయసులో శక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ఆలోచన సన్నగిల్లుతుందన్నారు. చదువుకోవాలన్న ధ్యాస తగ్గిపోవడంతో పాటు చేస్తున్న పనిపై ఏకాగ్రత తప్పుతుందన్నారు. కుటుంబ బాంధవ్యాలు దూరమవుతాయన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల బారిన పడిన వారి అవస్థలు. తెలిసి తెలియకో, స్నేహితుల ఒత్తిడి మేరకో ఒకసారి తీసుకుంటే మత్తుకు అలవాటై చివరకు బానిసవుతున్నారు. మత్తు నుంచి బయటపడలేక నిండుజీవితాన్ని బలి చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో సరఫరా, విక్రయం, వాడకంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటూనే మరోవైపు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో ఎవరికైనా పోలీస్ అవ్వాలని ఆసక్తి ఉన్నవారికి చదువుకునేందుకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తానని సిఐ హామీ ఇచ్చారు. ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ మాట్లాడుతూ గంజాయి, కొకైన వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు లేదా 9440796569 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర కళాశాల ప్రిన్సిపల్ ఆళ్ల రవి కిషోర్, ఆళ్ల శ్రీనివాస్ కిరణ్, వెంకటేశ్వరరావు, కాలేజీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ అప్పారావు, ఎస్ఐ

ఎంఎల్ఎ చినరాజప్పకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

బత్తులవారిగూడెంలో సభావేదిక కూలడంతో స్వల్పంగా గాయపడిన ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను శనివారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో పలువురు పరామర్శించారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ, పైన్నీ శ్రీనివాస రావు, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, రాజా సూరిబాబు రాజు, సర్పంచ్ పెంకే వెంకటేష్, చల్లా బుజ్జి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు ఉన్నారు.



రాజప్పను పరామర్శిస్తున్న యనమల

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని జొన్నాడ 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన పేపకాయల వెంకటేశ్వరరావు(47) బైకుపై శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో జొన్నాడ నుండి మూలస్థానం వెళుతుండగా ఒక కారు బలంగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కారు రహదారి డివైడర్ పైకి దూసుకు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యింది. కారులో గోపాలపురానికి చెందిన ఒక వ్యక్తి, ఇద్దరు మహిళలు, ఒక చిన్నారితో పాటు నలుగురు ఉన్నారు. వారంతా ప్రమాదం నుంచి క్షేమంగా బయట పడ్డారు. పరిస్థితి విషమించడంతో వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లి గ్రామం గోదావరి వశిష్ఠ నదిలో నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా శనివారం ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం తహశీల్దార్ కోర్టులో హాజరుపరచగా తహశీల్దార్ డివిఎస్.అనిల్ కుమార్ ఒక్కొక్క ట్రాక్టర్ యజమానికి రూ.5 వేల చొప్పున అపరాధ రుసుము విధించారు.

హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బుల్లెమ్మ

స్థానిక పద్మనాభ కాలనీలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కార్మిక చట్టాలు, బాల కార్మిక వ్యవస్థపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సరస్వతి ఆదేశాల మేరకు ఏజెఎఫ్‌సిఎం బుల్లెమ్మ ఆధ్వర్యంలో చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై వివరించారు. ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకుండా 18 ఏళ్ల లోపు బాలబాలికలు చదువుకోవాలన్నారు. మోటార్ వెహికల్ చట్టాలను వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదన్నారు. న్యాయవాదులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం (మణి), న్యాయవాదులు విశాలాక్షి, విజయలక్ష్మి, కందుల వెంకటచలం, సిహెచ్.చిట్టిబాబు, మడికి రాంబాబు, అత్తిలి ప్రభుశ్రీ, సుకురు దుర్గారావు, సత్యవతి, గణేష్, పారా లీగల్ వాలంటీర్లు భక్తమూడి సూర్యనారాయణమూర్తి, నూతలపాటి అప్పలకొండ, కెవిఎల్.లక్ష్మి, ఎం.భాస్కరరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త ఇలా.. సాగునీరు పారేదెలా..

ప్రజాశక్తి-తాళ్లరేవు


వంతెన కల్వర్టుపై పేరుకుపోయిన చెత్త

ప్రధాన సాగునీటి కాలువలో చెత్త పేరుకు పోతే సాగునీరు పారేదెలా అంటూ రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువకు నీరు విడుదల చేసి 23 రోజులు గడిచిన నేటికీ నారుమళ్ళు వేయడానికి కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ధవళేశ్వరం నుంచి వస్తున్న అరకొరా సాగునీరు ఇలా అక్కడక్కడ ప్రధాన కాలువలో పేరుకుపోతున్న చెత్త వల్ల సాగునీటికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. తాళ్లరేవు మండలం ఇంజరం, కాజులూరు మండలం కోలంక వంతెన వద్ద ప్రధాన సాగునీటి కాలువలో చెత్త పేరుకుపోవడంతో తాళ్లరేవు మండలానికి వచ్చే సాగునీరు పూర్తిస్థాయిలో కిందికి రావడం లేదు. దీనికి తోడు ఇటీవల అదే ప్రాంతంలో ఉన్న కల్వర్టు పగిలిపోవడం వల్ల నీరు వధాగా పోతోంది. ఇంజరం కోలంక వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా కల్వర్టు నిర్మించి సుమారు రెండేళ్లు గడుస్తోంది. ఈ కల్వర్టు వద్ద ప్రతిరోజు చెత్త తీయాల్సిన ఆర్ అండ్ బి శాఖ అధికారులు నిర్లక్ష్యంతో సాగునీరు కోలంక వంతెన వద్ద నిలిచిపోయింది. దీంతో తాళ్లరేవు మండలానికి రావలసిన వందలాది క్యూసెక్కుల నీరు కోలంక వద్ద ఆగిపోవడంతో కోరంగి శివారు భూములకు నేటికీ సాగునీరు రాలేదు. దీంతో రైతాంగం ఆందోళన పడుతున్నారు. నీటిపారుదల శాఖ, ఆర్. అండ్. బి. శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతాంగం కోరుతున్నారు.


సర్వే తీరును పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న సురక్ష సర్టిఫికెట్స్ పరిశీలన

ప్రజాశక్తి - కరప

జగనన్న సురక్ష పథకంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా గ్రామ వార్డు సచివాలయంలో ఇస్తామని ఎండిఓ కె.అప్పారావు తెలిపారు. శనివారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామ సచివాలయంలో ఈ సర్టిఫికెట్లను ప్రజలకు ఒక్క రోజులోనే అప్లికేషన్ పెట్టుకున్న లబ్ధిదారుకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.సునీల్ కుమార్, గ్రామ సర్పంచ్ సాగే ఆశాజ్యోతి లోహిదాస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

నవోదయ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షకోసం అయిదో తరగతి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆగస్టు 10లోగా దరఖాస్తు చేయాలని ప్రిన్సిపల్ వి.ఎస్.ప్రకాశరావు తెలిపారు. https://cbseitms.rcil.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ నంబరు కలిగి.. అన్ని ప్రశ్నకు లేదని నమోదు చేయాలని ప్రకాశరావు సూచించారు. ఆధార్ సంఖ్య నమోదు చేస్తే పుదుచ్చేరి నవోదయ విద్యాలయంలో చేరడానికి పరీక్ష రాసే అభ్యర్థుల జాబితాలోకి వెళతారన్నారు. తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలున్నా సంప్రదించాలని కోరారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 20న ఉంటుందన్నారు.

26న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం


ప్రజా పనుల శాఖకు సంబంధించిన టౌన్ వాటర్ వర్క్స్‌లో నిర్వహణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఇంజినీరు కళ్ల నాగరాజు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న సోమవారం సాయంత్రం మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్, కురసం పేట గ్రామాలకు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్లు నిర్మించడానికి, కార్లు, రోడ్లు, పశువులు కడగడానికి మంచి నీటిని వాడరాదని కోరారు.

పైపులైను నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం


పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్దనున్న మున్సిపల్ వాటర్ వర్క్స్ బూస్టర్ లైను నుంచి మెయిన్ రోడ్డు వరకు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించే పైపులైను నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పాండవుల మెట్ట, గౌరీ కోనేరు కాలనీలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు గోదావరి మంచి నీటిని సరఫరా చేసే ఈ పైపులైన్ల నిర్మాణంలో గతంలో మండపేట స్వీట్ స్టాల్ సెంటర్ నుంచి హెచ్‌పి గ్యాస్ సెంటర్ వరకు పైపులైన్ నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు మిగిలిన 575 మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కరరావు, పెంటకోట సత్తిబాబు, కొట్టి పవన్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న బలరామకృష్ణ

త్రిమూర్తులు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-రాజానగరం

నరేంద్రపురంలో ఇటీవల భార్యా వియోగంతో బాధ పడుతున్న తణుకు త్రిమూర్తులు, ఆయన కుటుంబాన్ని జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి శనివారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టిప్రోలు సత్తిబాబు, మద్దూరు బాపురాజు, ప్రగడ నాగు, రాంబాబు, అనిల్, బాబూరావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి -కరప


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబ్బంది

గురజనాపల్లి హైస్కూల్ లో పనిచేసి, వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు శనివారం ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. నూతన హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ పి.వీరబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సన్మాన గ్రహీతలు బిఆర్‌వి.ప్రసాదరావు రావికంపాడు హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. మరో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బిఎస్.శ్రీనివాస్ ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి హైస్కూల్ హెచ్‌ఎంగా ప్రమోషన్‌పై, మిగిలిన ఉపాధ్యాయులు జూనియర్ కళాశాల పిజిటీ ఉపాధ్యాయులుగా ఎం.రామ్మోహన్, టి.హనుమంతరావు బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వివి రమణమూర్తి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


రక్షణ గోడ విరిగి ప్రమాదకరంగా ఉన్న రహదారి మలుపు

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

వాకతిప్ప గ్రామ శివారులో పంట కాలువపై ఉన్న రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఎస్.ఆకారంలో ఉన్న ఈ రహదారి మలుపులో వంతెన ఎడమవైపు రక్షణ గోడ కొంత భాగం కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే లోతైన పంట కాలువలోకి వాహనాలతో సహా చోదకులు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనని తెలియని పరిస్థితి. ఈ వంతెన రహదారిమలుపు మీదుగా వాకతిప్ప నుంచి నాగుల చెరువు కు వెళ్లే గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, శ్రీరాంపురం గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు


కళాశాలలో సర్వే నిర్వహిస్తున్న బృందం

ఒకేషనల్ కళాశాలకు భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-కాకినాడ

పిఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి దినేష్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పినా ప్రభుత్వ విద్యారంగాన్ని గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఏకైక ఒకేషనల్ జూనియర్ కళాశాలకు భవనం లేకుండా ఒకే భవనంలో రెండు కళాశాల నడుస్తున్నా భవనం నిర్మించకపోవడం దుర్మార్గం అన్నారు. 600 నుండి 800 మంది విద్యార్థులు చదివే ఒకేషనల్ జూనియర్ కళాశాలకు పూర్తిస్థాయిలో భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. తక్షణమే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు సాహిత్, వాసు, లావణ్య, కప పాల్గొన్నారు.


మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



మెడల్స్ ,ప్రశంసా పత్రాలు ,అందజేసిన ప్రజా ప్రతినిధులు

మాచర ప్లస్ టూ ఉన్నత పాఠశాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు శనివారం మెడల్స్ , ప్రశంసా పత్రాలు అందించారు . జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి పరీక్షల్లో వరుసగా 555, 530, 519 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో సాధించిన విద్యార్థులు పివి.రాజ్యలక్ష్మి, బి.సుమశ్రీ, కె స్వాతీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాచర, కోరుమిల్లి గ్రామాల సర్పంచ్ లు వాసంశెట్టి సునీత విష్ణుమూర్తి, ఆచంట సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సుంకర వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని విద్యాభివద్ధిలో పురోగతి సాధించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్మీడియట్ ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో బాలికలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు, నూకపెయ్యి వెంకట్, షిరిడి సాయి, శ్రీనివాసరావు, వీరబాబు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.


నారుమడులు సిద్ధం చేస్తున్న దృశ్యం

తొలకరితో ఉపశమనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మూడు నెలలుగా వేసవి తాపానికి అల్లాడి పోయిన ప్రజలకు తొలకరి జల్లు లు ఉపశమనం కలిగించాయి. గత రెండు రోజుల నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. తొలకరి వర్షం కురుస్తుండటతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు ఆకుమడులు సిద్ధం చేసుకునేందుకు ఉపయోగ పడతాయని రైతులు తెలియ చేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు విస్తరించి వానలు కురుస్తూ వాతావరణంలో మార్పు చోటు చేసు కోవడంతో ప్రజలు సేద తీరుతున్నారు. మరో నాలు గు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడం తో వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కేశవరావు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పిఠాపురం

యువత మద్యం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాని ఆర్ఆర్ బిహెచ్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు సూచించారు. శనివారం మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా కళాశాలలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలోని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ నేడు ఎక్కువ శాతం యువత వ్యసనపరులుగా మారుతున్నారన్నారు. దీనివల్ల భవిష్యత్ కుటుంబాలు చిన్న బిన్నమవుతున్నాయన్నారు. నేటి కాలంలో జరిగే అన్ని దుర్ఘటనలకు మద్యం, మాదక ద్రవ్యాలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, కరణం శ్రీనివాస్, వనపర్తి సూర్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.అప్పారావు, ఎన్.గంగ బాబు, పలువురు కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొండబాబు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్


కొండబాబు చిత్రపటం నివాళులర్పిస్తున్న దృశ్యం

రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కరాటం వెంకట సుబ్బా రావు (కొండబాబు)సేవలు చిరస్మరణీయని పలువురు అన్నారు. శనివారం కొండ బాబు 4వ వర్ధంతిని రెడ్డిపల్లి, అమలాపురం వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల్లో నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురికి పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారులు కరాటం ప్రవీణ్, మనోహర్, వెంకటేశ్వరా కళాశాల అధినేత కరాటం నరసింహరావు, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.రాయుడు శ్రీ రామ చంద్రమూర్తి, యాలంగి వరప్రసాద్, బండి శ్రీనివాస్,సర్పంచ్ కరాటం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-అమలాపురం

. దళితులకు భద్రత కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలం అయ్యిందనిఅమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ జియం హరీష్ బాలయోగి అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అరాచక చర్యలు ఆగాలని అన్నారు. గురువారం రాత్రి గుంటూరుజిల్లా తాడికొండలోని కంతేరులో వైసిపిలోని రెండు వర్గాల మధ్య ఘర్షణలో ఎస్‌సి కాలనీకి చెందిన ముగ్గురు యువకులు గాయాలపలయ్యారని అన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడం పోలీసుల కనీస బాధ్యత కూడా వహించలేదని పేర్కొన్నారు. వారి విధులు కూడా సరిగ్గా నిర్వర్తించకపోవడం సరి కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాపారాయుడును పరామర్శించిన ఎంపీ బోస్

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రీ పాపారాయుడును రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అర్తమూరులో ఆయన స్వగృహంలో శనివారం పరామర్శించారు. పాపారాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.